క్లుప్తంగా

వేంకటరమణుడికి ధనుర్మాస పూజలు



పూజలందుకున్న సతీసమేత వేంకటరమణస్వామి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో ప్రసిద్ధిగాంచిన శ్రీప్రసన్న వేంకటరమణస్వామి ఆలయంలో ధనుర్మాస పూజలు చేశారు. బుధవారం తెల్లవారు జామున 5 గంటల నుంచి ధనుర్మాస పూజలు, స్వామి వారికి తిరుప్పావై సేవ నిర్వహించారు. ధనుర్మాసంతో పాటు నూతన సంవత్సరం కావడంతో భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు బాల మురళీకృష్ణ ఆధ్వర్యంలో స్వామి వారికి పంచామృతాభిషేకం, అభిషేకాలు, కుంకుమార్చన, నైవేద్యం, పుష్పార్చన, ప్రసాద వినియోగ కార్యక్రమాలు జరిగాయి. ఈ నెల 10న వైకుంఠ ఏకాదశి, 13న గోదాదేవి కల్యాణోత్సవం జరుగుతుందని దేవదాయశాఖ ఈఓ నరసింహారెడ్డి తెలిపారు.

భూగర్భ జలాల వృద్ధి



అరవకూరు వద్ద నీటితో కళకళలాడుతున్న బావి

కూడేరు: మండల పరిధిలోని అరవకూరు చెరువు గత రెండు నెలలుగా నీటితో కళకళలాడుతోంది. చెరువు పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు వృద్ధి చెందుతున్నాయి. బావుల్లోకి ఊట నీరు చేరుతుండటంతో నిండిపోతున్నాయి. వ్యవసాయ బోర్లలో కూడా కాస్త నీటి లభ్యత పెరిగడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పంటలు సాగు చేసుకోవడానికి నీటి కొరత ఉండదని చెబుతున్నారు. ఇప్పటికే పలవురు రైతులు వివిధ పలు రకాల పంటలు సాగు చేశారు.

వణికిస్తున్న చలి



కూడేరులో ఉదయం 8 గంటల ప్రాంతంలో చలిమంట కాచుకుంటున్న స్థానికులు

కూడేరు: మండల వ్యాప్తంగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. చలి తీవ్రత పెరగడంతో ప్రజలు గజగజ వణికిపోతున్నారు. కూడేరులో బుధవారం ఉదయం 8 గంటలు అయినా చలి తగ్గలేదు. చలికి తాళలేక ప్రజలు చలిమంట వేసుకున్నారు. ఎక్కువ మంది ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కూలీలు స్వెటర్లు, తలకు టవాళ్లు చుట్టుకుని చలి నుంచి రక్షణ పొందారు. టీకొట్ల వద్దకు వెళ్లి టీ తాగుతూ వెచ్చదనం పొందారు.

బహుజనులకు 'కోరేగావ్' స్ఫూర్తి



అంబేడ్కర్ విగ్రహం వద్ద అమరులకు నివాళులర్పిస్తున్న ఎస్సీ, ఎస్టీ నాయకులు

కంబదూరు: భీమా కోరేగావ్ యుద్ధం బహుజనుల పోరాటాలకు స్ఫూర్తిదాయకమని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ మండల ఉపాధ్యక్షుడు కురాకులపల్లి గోపాల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కోరేగావ్ దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా భీమా కోరేగావ్ అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఒంటారెడ్డిపల్లి నాగరాజు, జెక్కిరెడ్డిపల్లి నరసింహులు, వెట్టి జయప్ప, వన్నూర్ స్వామి,సూరి తదితరులు పాల్గొన్నారు.

గుట్కా విక్రయాల జోరు..

- నిషేధం పేరుకు మాత్రమే..
- ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయని అధికారులు
- గుట్కాతో చిత్తవుతున్న జీవితాలు



గుట్కా ప్యాకెట్లు (ఫైల్)

కళ్యాణదుర్గం: నియోజకవర్గంలో గుట్కా వ్యాపారం జోరుగా సాగుతోంది. చిరు వ్యాపారులు, విద్యార్థులు, యువత, ఆటోవాలా, దినసరి కూలీలను ఆసరాగా చేసుకున్న దుకాణదారులు విచ్చలవిడిగా అమ్ముకుంటున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్న గుట్కాను ప్రభుత్వం నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే కర్ణాటక రాష్ట్రం సరిహద్దులో ఉండటంతో గుట్కా జోరుగా విక్రయాలు సాగుతున్నాయి. పోలీసులు పలు దుకాణాల్లో అడపాదడపా తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటున్నారే కానీ పూర్తి స్థాయిలో వాటి విక్రయాలను అరికట్టలేకపోతున్నారు.

గుట్కా రవాణా మచ్చుకు ఇలా..

- కంబదూరు మండల కేంద్రంలోని చెక్‌పోస్టు వద్ద పోలీసులు భారీ మొత్తంలో గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. అయితే దీనిపై ఎలాంటి సమాచారం బయటకు రాకుండా పోలీసులు అప్రమత్తమయ్యారు. అప్పట్లో ఎంత మొత్తంలో గుట్కా ప్యాకెట్లు దొరికాయి..? ఎవరు తెచ్చారు. అన్న విషయాలు పోలీసులు గుట్టుగా వ్యవహరించి కేసును మమ అనిపించారు.
- కళ్యాణదుర్గం మండలం బోరంపల్లిలో ఓ చిరు దుకాణంలో సుమారు 624 గుట్కా ప్యాకెట్లను పోలీసులు పట్టుకున్నారు. కిరాణా మాటున గుట్కాలు అమ్ముతూ పట్టుబడిన వ్యక్తిపై కేసు నమోదు చేశారు.

అధికరేట్లను చెల్లించి..

గుట్కా వ్యాపారులకు కాసులు వర్షం కురుస్తోంది. గతంలో రూ.2 నుంచి 5 వరకు ఉండే గుట్కా ప్యాకెట్ ప్రస్తుతం రూ.10 నుంచి రూ.15 వరకు డిమాండ్ పలుకుతోంది. గతంలో రూ.5 నుంచి 10 వరకు ఉండే ఖైనీ ప్యాకెట్ ప్రస్తుతం రూ.30 నుంచి రూ.50 వరకు చేరుతుంది. ఇదేమని అడిగితే తాము అధిక రేట్లు చెల్లించి వేరే ప్రాంతాల నుంచి తెప్పించుకోవాల్సి వస్తుందని వినియోగదారులపై వ్యాపారులు చిందులు తొక్కుతున్నారు. చేసేదేమీ లేక వారు చెప్పిన రేట్లకు కొనుగోలు చేస్తున్నారు.

వ్యాపారం సాగుతుందిలా..

పట్టణంలో పలు దుకాణాల నుంచి ఖైనీ, గుట్కా ప్యాకెట్లు గ్రామీణ ప్రాంతాలకు సరఫరా అవుతున్నాయి. వాటిని కిరాణా దుకాణాల యజమానులు రహస్యంగా ఇంట్లో భద్రపరుచుకుని వారికి బాగా తెలిసిన వారికి మాత్రమే రహస్యంగా విక్రయిస్తూ నాలుగైదు రెట్లు అదనంగా వసూళ్లు చేస్తున్నారు. కర్ణాటక ప్రాంతం నుంచి ఓ టాటా సుమోలో ఉదయం 6 గంటలకే కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని శెట్టూరు, కంబదూరు, బ్రహ్మసముద్రం తోపాటు కళ్యాణదుర్గం వస్తున్నట్లు సమాచారం. ఇందులో అధికంగా హీరా, మానిక్ చంద్, పాన్‌పరాగ్, రాజా ఖైనీ ప్యాకెట్లు వస్తున్నట్లు తెలుస్తోంది. అదికూడా ఎవరికీ అనుమానం రాకుండా పోలీసుల కళ్లగప్పి కిరాణా సరుకులు తీసుకెళ్లే సంచుల్లో అడుగు భాగంలో వీటిని వేసుకుని తీసుకెళ్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణంలోని కొందరు వ్యాపారులకు పావగడ, బెంగుళూరు నుంచి ఖైనీ, గుట్కా ప్యాకెట్లు అధిక మొత్తంలో రావడంతో వీరి వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలు అన్నచందంగా సాగుతోంది.

ఆటోవాలాలు...యువతే టార్గెట్

ముఖ్యంగా ఆటో డ్రైవర్లు, యువతే టార్గెట్‌గా గుట్కా వ్యాపారస్తులు తమ వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. యువత గుట్కా, పాన్‌కు అలవాటు పడి వ్యసనంగా మార్చుకోవడం వల్లే దుర్గంలో అధికంగా వ్యాపారం జరుగుతున్నట్లు తెలుస్తోంది. దీనిపై గతంలో పోలీసులు సైతం పాన్ మసాలా సెంటర్లపై దాడులు నిర్వహించారు. అయితే గుట్టుగా వ్యాపారం చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

గుట్కా తింటే నోటి క్యాన్సర్



గుట్కాలు తింటే నోటి సమస్యలు మొదలుకుని జీర్ణవ్యవస్థ వరకు అన్నింటిపై ప్రభావం పడుతోంది. పళ్లు అరిగిపోయి గారలు పడుతాయి. నాలుక రుచిమొగ్గలు నశిస్తాయి. చివరకు నోరు, నాలుక, గొంతుకు క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది. వీటివల్ల ప్రాణనష్టం కూడా జరగొచ్చు.

– డాక్టర్ తరుణ సాయి, పీహెచ్‌సీ వైద్యురాలు, శెట్టూరు

సంయుక్త దాడులు చేస్తాం



గుట్కా అక్రమ రవాణాపై ఎక్సైజ్ అధికారులతో చర్చించి సంయుక్త దాడులు నిర్వహిస్తాం. అక్రమంగా నిల్వ చేసినట్లు తెలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం . గుట్కా ప్యాకెట్ల విక్రయంపై దుకాణాలపై దాడులు చేస్తాం. దాడులలో చిన్న మొత్తంలో ప్యాకెట్లు దొరికినా కేసులు కడుతున్నాం. చిరు దుకాణాల వ్యాపారస్తులకు కౌన్సిలింగ్ ఇస్తున్నాం.

– యువరాజు, పట్టణ సీఐ, కళ్యాణదుర్గం

విశ్వ ఇంట న్యూ ఇయర్ సందడి



కూడేరు: మాజీ ఎమ్మెల్యే విశ్వకు శుభాకాంక్షలు చెబుతున్న ఎంపీపీ, మండల కన్వీనర్

కూడేరు: ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డిని బుధవారం అనంతపురంలోని ఆయన స్వగృహంలో ఎంపీపీ నారాయణ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డితో పాటు పలవురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. నూతన సంవత్సరంలో అందరూ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు, సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

చర్చిల్లో న్యూ ఇయర్ వేడుకలు



సెయింట్ మేరీమాత చర్చిలో ప్రసంగిస్తున్న పాస్టర్

రాయదుర్గంటౌన్: పట్టణంలోని పలు చర్చీల్లో బుధవారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సెయింట్ మేరీమాత చర్చి, ఎఫ్రతా ప్రార్థన మందిరం, కేఎస్ క్రైస్ట్ చర్చి, జీసస్ కాలింగ్ మినిస్ట్రీస్, క్రైస్ట్ ప్రార్థన మందిరంలో పాస్టర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. పాత జ్ఞాపకాలను పారదోలి.. క్రీస్తు మార్గంలో మనిషి ఉత్తమ జీవితాన్ని గడపాలని ఉపదేశించారు.

ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి





అనంతపురంలో మాజీ ఎమ్మెల్యే విశ్వకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు, నూతన సంవత్సర కేక్ కట్ చేస్తున్న సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య

కళ్యాణదుర్గం: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య, పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, సీనియర్ నేత మాదినేని ఉమా మహేశ్వర నాయుడు స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల అధ్యక్షుడు, పార్టీ ప్రజాప్రతినిధులతో కలిసి కేక్ కట్ చేయించారు. నూతన సంవత్సరంలో నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నియోజకవర్గం లోని ఐదు మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కంబదూరు: మండలంలో నూతన సంవత్సరం వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఆయా గ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక సీఅండ్‌ఐజీ మిషన్ చర్చి, ములకనూరు బెరాక ప్రార్థన మందిరంలో పాస్టర్లు జేమ్స్,ప్రభుదాసు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి బైబిల్ సందేశాన్ని వినిపించారు.

బ్రహ్మసముద్రం : నూతన సంవత్సర వేడుకలను మండల వ్యాప్తంగా బుధవారం ఘనంగా నిర్వహించుకున్నారు. బ్రహ్మసముద్రం వైఎస్సార్ సీపీ నాయకులు మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య , రాష్ట్ర కార్యదర్శి బోయతిప్పేస్వామిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకులు గంగాధరప్ప, మహదేవప్ప, జిల్లా వాణిజ్యవిభాగం అధ్యక్షుడు రేవన్న, రైతు సంఘం అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, మాజీ మండల కన్వీనర్ చన్నమల్ల, ఎర్రిస్వామి, పాలబండ్ల చంద్రశేఖర్ రెడ్డి, అయ్యన్న, హనుమంతరెడ్డి, మాజీ సర్పంచ్ నరసింహులు, ఎంపీటీసీ బుసప్ప, మంజునాథ, నాగభూషణ పాల్గొన్నారు.

కుందుర్పి: స్థానిక కుసుమగిరి రైతు సంఘం ప్రయివేట్ లిమిటెడ్ వారి సౌజన్యంతో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని బుధవారం వందమంది అనాథ వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈనెల మొదటి వారంలో కుట్టు శిక్షణ పూర్తి చేసుకొన్న మహిళలకు 50 కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్నట్లు ఆసంస్థ సీఈఓ నరసింహ మూర్తి పేర్కొన్నారు. దుప్పట్లను హైదరాబాద్‌కు చెందిన బ్రహ్మసమాజ్ వారు వితరణ చేసినట్లు తెలిపారు. తహసీల్దార్ ఎస్పీ శ్రీనివాసులు, బ్రహ్మ సమాజ్ సంస్థ సభ్యులు నరేష్ పాల్గొన్నారు.

ఉరవకొండ : మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అనంతపురంలోని తన నివాసంలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కర్ణాటకకు తరలుతున్న పశుగ్రాసం



రాయదుర్గం మీదుగా ట్రాక్టర్‌లో కర్ణాటకకు తరలిస్తున్న వరిగడ్డి

రాయదుర్గం టౌన్: కర్ణాటకలో వరిగడ్డి (పశుగ్రాసం)కి భారీ డిమాండ్ ఉంది. ఈ నేపథ్యంలో సరిహద్దులోని రాయదుర్గం నియోజకవర్గం నుంచి పశుగ్రాసం (వరి గడ్డి) ఎక్కువగా కర్ణాటకకు తరలుతోంది. హెచ్చెల్సీ, బోర్ల కింద వరి పంట కోత పూర్తయిన రైతుల నుంచి గడ్డిని దళారులు కొనుగోలు చేస్తున్నారు. దాదాపు 50 వేల ఎకరాల్లో వరిపంట సాగు కాగా.. గడ్డి విస్తారంగా అందుబాటులో ఉంది. హెచ్చెల్సీ కింద ఒక్కటే అధికారిక రికార్డుల మేరకు 35 వేల ఎకరాల్లో వరిసాగయ్యింది. బొమ్మనహాళ్, కణేకల్లు ప్రాంతాల్లో అధికంగా సాగు చేసిన వరి గడ్డిని రైతులు అవసరం మేరకు ఉంచుకొని.. మిగతా గడ్డిని విక్రయించుకుంటున్నారు. స్థానికంగా ట్రాక్టర్ వరిగడ్డి ధర రూ.5 వేల నుంచి రూ.5,500 దాకా పలుకుతోంది. కర్ణాటకలో రూ.7 వేల దాకా ధర ఉంది. దీంతో దళారులు ఇక్కడి రైతులతో వీలైనంత మేర కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని గడ్డి కొరత రాకుండా ప్రభుత్వమే రైతుల నుంచి సేకరించి కొనుగోలు కేంద్రాల్లో నిల్వ చేసుకుంటే ఉపయోగకరంగా ఉంటుందని పలువురు సూచిస్తున్నారు.

నూతన కాంతులు వెల్లివిరియాలి



రాయదుర్గంలో కార్యకర్తలతో కలసి కేక్ కట్‌చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గం: నూతన సంవత్సరంలో ప్రజలందరి జీవితాల్లో నూతన కాంతులు వెల్లివిరియాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి ఆకాంక్షించారు. బుధవారం రాయదుర్గంలోని తన నివాసం వద్దకు తరలివచ్చిన పట్టణ, డీ హీరేహాళ్, గుమ్మఘట్ట, బొమ్మనహాళ్, రాయదుర్గం మండలాల ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో న్యూ ఇయర్ కేక్ కట్ చేశారు. మెట్టుకు శుభాకాంక్షలు తెలపడానికి నాయకులు పోటీ పడ్డారు. అలాగే వైఎస్సార్‌సీపీ యువనేత మెట్టు విశ్వనాథరెడ్డికి అభిమానులు, కార్యకర్తలు శుభాకాంక్షలు చెప్పారు. ఇక నేసేపేటలోని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప ఇంటివద్ద 'నూతన' సందడి నెలకొంది. మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి సహా వివిధ విభాగాలకు చెందిన అధికార యంత్రాగం, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జులు, వైఎస్సార్‌సీపీ నాయకులు తరలివెళ్లి చైర్‌పర్సన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేంద్రారెడ్డికి నాయకులు, కార్యకర్తలు న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో కేక్‌కట్‌చేసి సంబరాలు జరిపారు. అధికారులు, టీడీపీ నాయకులు అక్కడివెళ్లి ఎమ్మెల్యే నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ నాయకుడు కాపు రామచంద్రారెడ్డి నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు.



రాయదుర్గంలో రైతు విభాగం నేత ఉపేంద్రారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



రాయదుర్గం మున్సిపల్ చైర్‌పర్సన్ శిల్పకు మాజీ సీఎం జగన్ ఫొటోను అందజేస్తున్న దృశ్యం

సంబరంగా 'నూతన' వేడుకలు



ఉద్దేహాళ్ వద్ద కేక్ కట్ చేస్తున్న ఎస్‌ఐ నబీరసూల్

కణేకల్లు/ బొమ్మనహాళ్: నూతన సంవత్సర వేడుకలను కణేకల్లులో ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. మంగళవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో యువకులు, చిన్నారులు వైఎస్సార్ సర్కిల్, దిగువవీధి, ఉరవకొండ, రామనగర్ తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి కేకులు కట్ చేసి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. బుధవారం ఉదయం చిక్కణ్ణేశ్వరస్వామి, షిర్డిసాయిబాబా, ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించి.. ఈ యేడాది అంతా శుభం జరిగేలా చూడాలని దేవున్ని ప్రార్థించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. మండల స్థాయి అధికారులకు ఉద్యోగులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి ఆ తర్వాత కేక్‌లను కత్తిరించారు.

- బొమ్మనహాళ్ మండల వ్యాప్తంగా బుధవారం నూతన సంవత్సరం వేడుకలు సంబరంగా జరిగాయి. గ్రామాల్లో యువతీ యువకులు సేహ్నితులు, అభిమానులు ఒకరికొకరు న్యూ ఇయర్ శుభాకాక్షలు చెప్పుకున్నారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. ఎస్‌ఐ నబీరసూల్, తహశీల్దార్ మునివేలు కేక్ కట్ చేసి సంబరాల్లో పాల్గొన్నారు.

గుత్తి కోటను సందర్శించిన విదేశీయులు



గుత్తి కోట గురించి తెలుసుకుంటున్న విదేశీయులు

గుత్తి: చారిత్రక గుత్తి కోటను బుధవారం విదేశీయులు సందర్శించారు. ఇంగ్లాండ్‌కు చెందిన లిజీ ఎలిజబెత్, క్రిష్టఫర్ కోటలోని ఏనుగు శాలలు, గుర్రపు శాలలు, బావులు, రంగ మంటపం, చీకటి గదులు తదితర వాటిని పరిశీలించారు. గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ భాస్కర్, గైడ్ రమేష్ గుత్తి కోట చరిత్రను వారికి వివరించారు. కోట అద్భుతంగా ఉందని విదేశీయులు కొనియాడారు.

ప్రమాదకరంగా కల్వర్టులు



కోట వాకిలి వెనుక రోడ్డులో దెబ్బతిన్న కల్వర్టు



జేఆర్‌ఎస్ కాలనీలో..



శేషప్పగుడి సమీపంలో..

రాయదుర్గంటౌన్: పట్టణంలోని అనేక ప్రాంతాల్లోని రోడ్లపై కల్వర్టులు దెబ్బతిని ప్రమాదకరంగా మారుతున్నాయి. కోట ఊరువాకిలి వెనుక రోడ్డులో కల్వర్టు సగానికి పైగా దెబ్బతినడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కోట వాకిలి నుంచి ప్రముఖ ఆలయాలకు వెళ్లేందుకు ముఖ్యమైన దారిలో దెబ్బతిన్న కల్వర్టును అధికారులు పట్టించుకోవడం లేదని సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతోంది. మారెమ్మగుడికి వెళ్లే దారిలో నుంచి శేషప్ప గుడి సమీపంలోని ఓ వీధిలో కల్వర్టు ధ్వంసమైంది. జేఆర్‌ఎస్ కాలనీలో కల్వర్టు కూడా సగానికి పైగా దెబ్బతిని రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. వీటితోపాటు మరిన్ని చోట్ల కల్వర్టు దెబ్బతిన్నాయి. కల్వర్టులను మరమ్మతు చేయించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

జల్‌జీవన్ మిషన్ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్

ఉరవకొండ: పట్టణంలో మరో 30 సంవత్సరాలు తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. బుధవారం ఉరవకొండ ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కార్యాలయ ఆవరణలో జల్‌జీవన్ మిషన్ పనులను ప్రారంభించారు. జల్‌జీవన్ మిషన్ కింద రూ.21.54 కోట్ల అంచనా వ్యయంతో ఉరవకొండ మండలంలోని 27 గ్రామాలకు తాగునీరు సరఫరా చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, ఉరవకొండ ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సఫ్రీన్, తహసీల్దార్ మహబూబ్‌బాషా, ఎంపీడీఓ రవిప్రసాద్, పీఆర్ డీఈ మహ్మద్ రసూల్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఐజయ్య, ఆయాశాఖ అధికారులు పాల్గొన్నారు.